క్లుప్తంగా

రక్తహీనతకు గురికావొద్దు



విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కూడేరు: కిశోర బాలికలు రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారాన్ని తప్పని సరిగా తీసుకోవాలని మండల వైద్యాధికారిణి సౌమ్యారెడ్డి సూచించారు. గురువారం కూడేరులోని కేజీబీవీలో విద్యార్థినులకు రక్తంలో హిమోగ్లోబిన్ (హెచ్‌బీ) పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువ ఉన్న విద్యార్థినులకు ఐరన్ మాత్రలు అందించారు. మహిళల్లో హిమోగ్లోబిన్ శాతం 13 వరకు ఉండాలని వైద్యాధికారిణి తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారిణి ఉమాదేవి, ఏఎన్‌ఎంలు చంద్రకళ, మాధవి, సుశీల, బాను, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శుభకార్యం

బ్రహ్మసముద్రం : మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దేవపుత్ర కుమార్తె వివాహం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్‌ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎల్‌ఎం మోహన్ రెడ్డి హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి, మండల కన్వీనర్ బసవరాజు, మాజీ ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రామాంజనేయులు, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ప్రసాద్ రెడ్డి, మండల రైతు సంఘం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ లోకేష్, నాయకులు జిన్నామల్లి, తిమ్మారెడ్డి, ఏసెఫ్ తదితరులు హాజరయ్యారు.

ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి

కంబదూరు: ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తేనే ఆరోగ్యంగా ఉండొచ్చని వైద్యాధికారిణి ఆసియా తెలిపారు. గురువారం మండలంలోని జెక్కిరెడ్డిపల్లి గ్రామంలో 104 వాహనం ద్వారా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ ఆసియా గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. తర్వాత సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది యల్లంరాజు పాల్గొన్నారు.

మూరాద్‌షావలి ఉరుసు



మురాద్‌షావలి స్వామిని అలంకరించిన దృశ్యం

వజ్రకరూరు: మండల కేంద్రంలో హజరత్ సయ్యద్ మూరాద్‌షావలి 387వ ఉరుసు వైభవంగా జరిగింది. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకొని స్వామి సమాధిని ప్రత్యేకంగా అలంకరించారు.

తేలుకాటుతో విద్యార్థికి అస్వస్థత

బొమ్మనహాళ్: పాఠశాలలో తేలు కుట్టి ఓ విద్యార్థి బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు జెడ్పీహెచ్‌ఎస్ 9వతరగతి విద్యార్థి వన్నూరుస్వామి మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లాడు. తరగతులు జరుగుతున్న సమయంలో పుస్తకాలు బయటకు తీస్తుండగా బ్యాగులో ఉన్న తేలు కాటు వేసింది. అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు బళ్లారి విమ్స్‌కు తరలించారు. మూడు రోజుల నుంచి అక్కడే చికిత్స పొందుతున్నట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. ఈ విషయంపై ఎంఈఓ మల్లికార్జునను అడగ్గా విద్యార్థికి తేలు కుట్టిన విషయం తెలియదని, దీనిపై విచారిస్తానని తెలిపారు.

కూడేరుకు 870 క్వింటాళ్ల కేటాయింపు

కూడేరు: మండలానికి ప్రత్యామ్నాయ విత్తనాలైన ఉలువలు, కొర్రలు, జొన్నలను ప్రభుత్వం 870 క్వింటాళ్ల కేటాయించినట్లు ఏఈఓ శైలజ తెలిపారు. 850 క్వింటాళ్ల ఉలువలు, 10 క్వింటాళ్ల కొర్రలు, 10 క్వింటాళ్ల జొన్నలు 80శాతం సబ్సిడీతో పంపిణీ చేయనున్నట్లు ఏఈఓ తెలిపారు.

ఘనంగా సీతారాముల కల్యాణోత్సవం



సీతారామ కల్యాణోత్సవం నిర్వహిస్తున్నపండితులు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకొని గురువారం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామివారు పంచలోహ కవచాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి, పుష్పాలతో అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో సీతాములను పెళ్లి కొడుకుగాను, పెళ్లి కుమార్తెగా విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి, కొలువుదీర్చారు. కల్యాణోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



ఆస్పత్రుల్లో వైద్యసిబ్బందికి భద్రత కల్పించాలి

కోల్‌కతా లాంటి ఘటనలు పునావృతం కాకుండా ఆస్పత్రుల్లో భద్రత కల్పించాలి. మహిళా వైద్యులు, సిబ్బందికి రక్షణ, భద్రత ఉంటేనే వైద్యం అందించేందుకు వీలవుతుంది. పోలీసులుంటే పేషెంట్లు, వారి బంధువులకు కూడా ఒక హెచ్చరికవుతుంది. కోల్‌కతా ఘటనలో బాధిత కుటుంబానికి ప్రభుత్వాలు న్యాయం చేయాలి. వైద్యులు, సిబ్బందిలో ఆత్మస్థైర్యం నింపాలి.

– మున్వర్‌రాజ్, అసిస్టెంట్ సివిల్ సర్జన్, రాయదుర్గం ఏరియా హాస్పిటల్

కఠిన చట్టాలు రూపొందించాలి



ప్రభుత్వాస్పత్రులకు రాత్రివేళలో ప్రసవాలకు గర్భిణులు, అత్యవసర కేసులూ వస్తుంటాయి. ప్రభుత్వాస్పత్రిలో మేము సురక్షితంగా ఉంటేనే రోగులకు ప్రశాంతంగా వైద్య సేవలు అందించ గలుగుతాం. వైద్యులు, వైద్య సిబ్బందిపైనే అత్యాచారాలు, దాడులు, అఘాయిత్యాలు జరుగుతుండడం దారుణం. ప్రభుత్వాలు వైద్యసిబ్బంది భద్రతకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి.

– భవాని, స్టాఫ్‌నర్సు, కంబదూరు పీహెచ్‌సీ

మల్చింగ్ సాగు.. లాభాలు బాగు

- నీరు ఆదా.. పెట్టుబడి పొదుపు
- ఒకే ఖర్చుతో రెండు పంటలకు అవకాశం
- మల్చింగ్ విధానంలో పంటల సాగుకు అన్నదాతలు ఆసక్తి



ఉద్యాన పంటకు పరిచిన మల్చింగ్ షీట్



మల్చింగ్ ద్వారా సాగైన మిరప పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారులు

కంబదూరు: వర్షాభావంతో పంటల దిగుబడి రాక, పెట్టుబడులు చేతికందక తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం కాలానుగుణంగా వ్యవసాయ విధానాలు మారుతున్నాయి. దీంతో రైతులు సంప్రదాయ వ్యవసాయానికి స్వస్తి చెప్పి ఆధునిక వ్యవసాయంపై మొగ్గుచూపుతున్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడినిచ్చే పంటల సాగుకు ఆసక్తిచూపుతున్నారు. ఎక్కువ శాతం మంది రైతులు ఉద్యాన పంటలకు మల్చింగ్ వినియోగిస్తూ అధిక దిగుబడితోపాటు లాభాలు గడిస్తున్నారు. ఈ విధానం కూడా రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయాధికారులు చెప్తున్నారు.

కంబదూరు ఉద్యానశాఖ కార్యాలయం పరిధిలోని కంబదూరు,కుందుర్పి, శెట్టూరు మండలాల్లోని రైతులు టమాట, బొప్పాయి, అరటి, మిరప, కర్బూజ, కలింగర వంటి ఉద్యాన పంటలను రెండు వేల ఎకరాల్లో మల్చింగ్ విధానం ద్వారా సాగు చేశారు. ఇక్కడి వాతావరణం దృష్ట్యా మల్చింగ్ విధానంతో ఉద్యాన పంటలు సాగు చేయడం వల్ల బహుళ ప్రయోజనాలు పొందొచ్చని ఉద్యానశాఖ అధికారులు చెప్తున్నారు.

మల్చింగ్ వల్ల కలిగే ప్రయోజనాలు అనేకం..

ఉద్యాన పంటలకు మల్చింగ్ వినియోగించడం వల్ల డ్రిప్ ద్వారా తక్కువ నీటితో పంటలు పండించొచ్చు. అలాగే మల్చింగ్‌తో కలుపు సమస్య ఉండదు. చీడపీడలు తక్కువగా వ్యాపిస్తాయి. తద్వారా మొక్క బాగా ఎదిగి అధిక దిగుబడులు వస్తుండడంతో పాటు ప్రభుత్వాలు కూడా రాయితీతో మల్చింగ్ షీట్లను రైతులకు అందజేస్తుండడం వల్ల రైతులు మల్చింగ్‌పై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

తెగుళ్లు తక్కువగా సోకుతాయి..

మల్చింగ్ ద్వారా పంటలు సాగు చేయడం వల్ల వర్షాభావ పరిస్థితుల్లో నీటిని ఆదా చేసుకోవచ్చు. మల్చింగ్ కింద డ్రిప్ పైపు వేయడం వల్ల మొక్కకు నీరు సమృద్ధిగా అందుతుంది. మొక్క కింద భూమి పొడిగా ఉండి వేరు వ్యవస్థ ఆరోగ్యంగా పెరుగుతుంది. అలాగే మల్చింగ్ కలుపు నివారించడం ద్వారా కూలీల ఖర్చు కూడా తగ్గుతుంది. మల్చింగ్ వల్ల భారీ వర్షాలు కురిసినా తెగుళ్లు తుక్కువగా సోకుతాయి. డ్రిప్ ద్వారా వేసే ఎరువులు మొక్కకు బాగా అందుతాయి. తద్వారా పంట బాగా వచ్చి దిగుబడులు పెరిగి మంచి లాభాలు సాధించే అవకాశాలు ఉన్నాయి.

మల్చింగ్ షీట్లు రాయితీతో ఇవ్వాలి



ప్రస్తుతం ఏ ఉద్యాన పంట సాగు చేయాలన్నా మల్చింగ్ షీట్ చాలా అవసరం. బయట మార్కెట్‌లో కొనుగోలు చేసి పంటలు సాగు చేయాలంటే పెట్టుబడులు అధికమవుతాయి. ఇలాంటి తరుణంలో గతంలో ఏ విధంగా అయితే సబ్సిడీతో మల్చింగ్ షీట్‌ను ఇచ్చే వారో ప్రస్తుత ప్రభుత్వం కూడా రాయితీతో రైతులకు మల్చింగ్ షీట్‌ను ఇవ్వాలి.

– వెంకటేశులు, రైతు, ఒంటారెడ్డిపల్లి, కంబదూరు మండలం

మల్చింగ్ విధానంతో రూ.15 వేలు ఆదా..



మల్చింగ్ షీట్ ద్వారా మిరప,కలింగర,కర్బూజ, టమాట వంటి ఉద్యాన పంటలను సాగు చేస్తాను. సాధారణంగా మల్చింగ్ లేకుండా ఉద్యాన పంటలు సాగు చేస్తే ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేలు ఖర్చవుతుంది. అదే ఉద్యాన పంటలకు మల్చింగ్ వేసి సాగు చేస్తే ఎకరాకు రూ.10 నుంచి రూ.15 వేలు ఖర్చు తగ్గుతుంది. కలుపు సమస్య ఉండదు. చీడపీడలు తక్కువగా వ్యాపిస్తాయి. కూలీల ఖర్చు,ఎరువుల వాడకం తగ్గుతుంది. తద్వారా పెట్టుబడి ఆదా అవుతుంది.కూలీల ఖర్చు తగ్గి అధిక దిగుబడులతో లాభాలు సాధిస్తున్నా.

– శివకుమార్, రైతు, కంబదూరు

మల్చింగ్ సాగుతో రైతులకు ప్రయోజనం



మల్చింగ్ విధానంతో పంటలు సాగు చేయడం ద్వారా రైతులకు అనేక బహుళ ప్రయోజనాలు పొందవచ్చు. వర్షాభావ పరిస్థితులలో కూడా పంటలను పండించవచ్చు. మల్చింగ్‌ను వినియోగించడం వల్ల పెట్టుబడులు తగ్గి, మంచి దిగుబడులతో అధిక లాభాలు సాధించవచ్చు. మల్చింగ్ విధానంతో పంటలు సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం.

– గౌసియాబేగం, హెచ్ఓ,కంబదూరు

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ



కొలగానహళ్లిలో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్: మండలంలోని కొలగానహళ్లిలో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వ్యాధి లక్షణాలు, నివారణపై గురువారం ర్యాలీ చేశారు. శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారులు కుమారరాజా, గీతా భార్గవి మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల వల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికున్ గున్యా లాంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త వెంకటరమణ, బాలాజీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

విడపనకల్లు: విడపనకల్లు మోడల్ స్కూల్లో గురువారం ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ బత్తుల కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండే విధంగా ముందు జాగ్రత్త చర్యగా పాఠశాలలోని అన్ని తరగతి గదుల్లో దోమల నివాణ మందును పిచికారీ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధర్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారు సంఘాల అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న ఏఎల్‌పీ కోఆర్డినేటర్ రిజ్వానా

బెళుగుప్ప: మండల పరిధిలోని గ్రామాల్లోని రైతు ఉత్పత్తి దారుల పరస్పర సహకార సంఘాల అభివృద్ధే లక్ష్యం అని ఎకాలజీ విభాగం ఏఎల్‌పీ కోఆర్డినేటర్ రిజ్వానా తెలిపారు. గురువారం మండల పరిధిలోని వెంకటాద్రిపల్లి లోని ఎకాలజీ ఫీల్డ్ కార్యాలయంలో బెళుగుప్ప రైతు ఉత్పత్తిదారుల సంఘం లిమిటెడ్ అధ్యక్షుడు అక్కులమ్మ అధ్యక్షతన ఎనిమిదో వార్షికోత్సవ మహాసభ జరిగింది. ఎఫ్‌టీఓ టీమ్ లీడర్ శంకర్‌నాయక్, ఎఫ్‌టీఓ మేనేజర్ రమేష్, సీఈఓ హరీష్ హాజరయ్యారు. తొలుత బెళుగుప్ప మండల రైతు ఉత్పత్తిదారుల సంఘం పాలక వర్గాల సభ్యులు రైతు సంఘ ఉత్పత్తిదారు వాటాదారులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంటీఎల్ భవాని, హరి, సీఈఓ హరీష్, ఎస్‌టోలు, సీఈఓలు, బీఓడీ సభ్యులు, రైతులు, మహిళా రైతు సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆదిచెన్నకేశవస్వామి రథోత్సవం



అలంకరణలో ఆదిచెన్నకేశవస్వామి మూలవిరాట్

వజ్రకరూరు: మండల పరిధిలోని కొనకొండ్లలో భక్తుల కొంగు బంగారం ఆదిచెన్నకేశవ స్వామి ఆలయంలో గురువారం రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకం, నగ్రవహ హోమం, అభిషేకం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు ఎమ్మెల్సీ వై.శివరామి రెడ్డి, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీదేవి,భూదేవి సమేతశ్రీ ఆదిచెన్నకేశవ స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వినియోగం, పల్లకీ సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 30న స్వామికి అభిషేకం, 11 గంటలకు పల్లకీసేవ, మడుగురుతేరు, సాయంత్రం 5 గంటలకు ఉట్ల ఉత్సవం, రథోత్సవం జరుగుతుందని ఈఓ అంగదాల కృష్ణయ్య తెలిపారు. 31న శ్రీస్వామివారికి అభిషేకం, పల్లకీసేవ, వసంతోత్సవం, రాత్రి 8గంటలకు భూదేవి, లక్ష్మమ్మ దోపులు, పల్లకీసేవ తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

దుర్గంలో ఆగని భూ కబ్జా



బీటీపీ లేఅవుట్‌లోని రిజర్వు స్థలంలో పునాదులు తవ్విన దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణ శివారు బీటీపీ హౌసింగ్ లేఅవుట్‌లోని రిజర్వ్ స్థలాల కబ్జా యథేచ్ఛగా కొనసాగుతోంది. అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు దర్జాగా స్థలాలు కబ్జా చేసి, పునాదులు వేసుకుంటున్నారు. బీటీపీ హౌసింగ్‌లో లేఅవుట్, ఇందిరమ్మ కాలనీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోని జగనన్న కాలనీల్లో పేదలకు కేటాయించిన స్థలాలను అక్రమార్కులు కబ్జా చేసి, వాటిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో అడ్డుకొని రిజర్వు స్థలాలను కాపాడాల్సిన అధికారులు పట్టించుకోలేదు.దీనిపై డీటీ రఘును విచారించగా, కబ్జా చేసి పునాదులు తవ్వుతున్న విషయంపై ఫిర్యాదులు వచ్చాయని, వెంటనే సిబ్బందిని పంపి, వాటిని నిలుపుదల చేశామన్నారు. ఎవరైనా రిజర్వు స్థలాలను కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చాదర్‌ను సమర్పించిన మాజీ ఎమ్మెల్యే విశ్వ



జైనబ్బీ అమ్మవారికి చాదర్ ఊరేగింపుగా తీసుకొస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన హజరత్ బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసు ఉత్సవాలు గురువారం జరిగాయి. అమ్మవారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం నుంచి అమ్మవారికి ప్రత్యేకంగా చాదర్, పూల మాలను ఊరేగింపుగా తీసుకొచ్చి దర్గాకు సమర్పించారు. అనంతరం అమ్మవారి జీవసమాధి మీద చాదర్‌ను కప్పి, పూలమాల వేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా కమిటీ అధ్యక్షుడు హోతూరు బాషా ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే విశ్వను ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు బళ్లారి ఆసీఫ్, మోమిన్ జిలాన్, కపత్రాళ్ల బషీర్, కణేకల్లు రఫీక్, డ్రైవర్స్‌కాలనీ శర్మాస్, టైలర్ శర్మాస్, పార్టీ నాయకులు గోవిందు, బసవరాజు, సింగాడి తిప్పయ్య, మూలగిరి ఓబన్న, పచ్చిరవి, వేమన్న, అంగదాల ఆంజి, ఓబన్న పాల్గొన్నారు.

'దుర్గం' అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం అభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఎమ్మెల్యే సురేంద్రబాబు కోరారు. గురువారం స్థానిక ఆర్‌డీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే సురేంద్రబాబు మాట్లాడుతూ బీటీపీ ప్రాజెక్టు పనులు పూర్తి చేసే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్‌ను కోరారు. అనంతరం నియోజకవర్గంలోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాణీసుస్మిత, డీఎస్పీ రవిబాబు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక



జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న దృశ్యం

వజ్రకరూరు: స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డుకు మండలంలోని కొనకొండ్ల జెడ్పీహైస్కూల్ ఎంపికయ్యింది.క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో కలెక్టర్ వినోద్‌కుమార్ చేతుల మీదుగా ఎక్సలెన్స్ అవార్డును హెచ్‌ఎం వేణుగోపాల్, వ్యాయామ ఉపాధ్యాయుడు సత్యనారాయణ, కళా సుధాకర్ అందుకున్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో జరిగిన జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన 27 మంది విద్యార్థులు పాల్గొని, ప్రతిభ కనబరినట్లు హెచ్‌ఎం తెలిపారు. పాఠశాల ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక కావడంపై ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సంక్షిప్త సమాచారం

వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని గోళ్ల గ్రామం వద్ద బైక్ ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలు... యాలేరుకు చెందిన శంకరయ్య కళ్యాణదుర్గం నుంచి ద్విచక్ర వాహనంపై అనంతపురం వైపు వెళ్తున్నాడు. అదేసమయంలో అనంతపురం నుంచి వెళ్తున్న ఆర్టీసీ బస్సు గోళ్ల వద్ద ఢీకొనింది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శంకరయ్యను మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

దళిత, గిరిజనుల హక్కుల సాధన సమితి అధ్యక్షుడిగా రమేష్



సాకే రమేష్

ఉరవకొండ: దళిత, గిరిజనుల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా సాకే రమేష్ నియమితులయ్యారు. గురువారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రాష్ట్ర అధ్యక్షుడి నియామకం జరిగింది. రేణుమాకుపల్లికి చెందిన బి.సాకే రమేష్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవస్థాపక అధ్యక్షుడు మీసుగ గోపాల్ ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

31న పింఛన్ల పంపిణీ

గుమ్మఘట్ట: ఈనెల 31న పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. 31న అందుబాటులోలేని పింఛన్‌దారులకు 2న పంపిణీ చేయాలన్నారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

బెళుగుప్ప: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ హుస్సేన్ పీరా ఆధ్వర్యంలో వ్యవసాయ సిబ్బందికి పంటకోత ప్రయోగాలపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఏఎస్ఓ మమత , ఏఓ పృథ్వి సాగర్ పంట కోత ప్రయోగాలపై జాగ్రత్తలు తెలియజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కుందుర్పి: మండలంలోని శ్రీమజ్జనపల్లిలో పేకాట ఆడుతూ ఐదుగురు పట్టుపడ్డారు. అందిన సమాచారం మేరకు బుధవారం అర్ధరాత్రి ఆ గ్రామంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఐదుగురు పట్టుబడగా, మరో ముగ్గురు తప్పించుకుని పారిపోయినట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. నిందితుల నుంచి రూ.85,350 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మల్లికార్జున రాజీనామా డ్రామా

రాయదుర్గం: డీ హీరేహాళ్ మండలం చెర్లోపల్లికి చెందిన టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు మెండి మల్లికార్జున రెండు రోజుల నుంచి రాజీనామా డ్రామాకు తెరలేపారు. సామాజిక మాధ్యమాల్లో తనకు తానుగా పోస్టులు పెడుతూ నవ్వుల పాలయ్యాడు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగా, ప్రజలు తనను ఎంపీటీసీగా ఎన్నుకున్నారని, టీడీపీ అధికారంలోకొచ్చాక తనను విస్మరించారని, ఎంపీటీసీ పదవికి రాజీనామా చేస్తానని గ్రూపుల్లో పోస్టు చేశాడు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే నేతల మధ్య ముసలం మొదలైందని ప్రజలు చర్చించుకున్నారు. ఇదిలా ఉండగా ఉన్నట్టుండి పార్టీ మండల కన్వీనర్ బుజ్జగించినట్లు మల్లికార్జున సోషల్ మీడియాలో మరో పోస్టు పెట్టారు. రాజీనామాపై వెనక్కి తగ్గానని ప్రకటించుకున్నాడు. దీంతో అయ్యో మల్లీ... ఇదేంది లొల్లి అంటూ ప్రజలు నవ్వుకుంటున్నారు.

విద్యార్థులు దేశం గర్వించే స్థాయికి చేరాలి





ఉరవకొండ: విన్యాసాలు చేస్తున్న విద్యార్థినులు, తెలుగు రచయితలు, కవులు చిత్రపటాలను ప్రదర్శిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ

= ఘనంగా తెలుగుభాష, క్రీడా దినోత్సవం

రాయదుర్గం: విద్యతోనే పేదరికాన్ని తరిమికొట్టొచ్చని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని 74 ఉడేగొళం సమీపాన కేటీఎస్ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. దెబ్బతిన్న కాంపౌండ్‌వాల్, లైబ్రరీగది నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. అనంతరం రూ.1.4 కోట్లతో నిర్మించిన రూసా గదులను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ రఘురామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, సర్పంచ్ దురుగమ్మ, జెడ్పీటీసీ హొన్నే మల్లికార్జున, సీడీసీ బసవరాజు, డీఈరమణారెడ్డి, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలోని సరస్వతీ శిశుమందిరంలో క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులకు గురువారం ఆటలపోటీలు నిర్వహించారు. సీతను రాముడిని కనిపెట్టడం, చదరంగం, అష్టాచమ్మా, గోలీలాట, తొక్కుడు, తాడాట, మేకపులి, క్యారమ్స్ ఆటలతో విద్యార్థులు ఉత్సాహంగా గడిపారు. ప్రధానచార్యులు రాజేశ్వరి పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: మండలంలోని నారాయణపురం ప్రాథమిక పాఠశాలలో క్రీడా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సురేష్ బాబు, ఉపాధ్యాయులు నరసింహులు, రమేష్‌బాబు విద్యార్థులకు క్రీడా పరికరాలను అందజేశారు.

బ్రహ్మసముద్రం : మండలంలోని వేపులపర్తి ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు ఆనంద్ రెడ్డి, గౌరి, నరసింహ మూర్తి , స్వరూపరాణి, శ్రీదేవి, ఝాన్సీ, వాణీ, పీఈటీలు నీలకంఠ అనసూయ తదితరులు పాల్గొన్నారు.

కంబదూరు: తెలుగుభాష మహోన్నతమైందని కంబదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు అన్నారు. గురువారం స్థానిక పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు రమణారెడ్డి, రామ్మోహన్, వెంకటేశులు, రవీంద్రనాథ్, అరుణదేవీ, కుళ్లాయమ్మ, కళావతి, ప్రశాంత్‌కుమార్, శంకర నారాయణ, హనుమంతరాయుడు, నాగరాణి పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: తెలుగుజాతి గొప్పతనాన్ని, ఔనత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు భాష దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.

కళ్యాణదుర్గం రూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని, ఆరోగ్యంగా ఉండొచ్చని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జయరాం రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎస్వీజీఎం డిగ్రీ కళాశాలలో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేషయ్య, సూర్యనాగిరెడ్డి, శ్రీధర్, శైలజారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

ఉరవకొండ: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల ఎస్సీ గురుకుల పాఠశాలలో క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ సునీత మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రామకృష్ణ, పీడీ ప్రశాంత్ ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవం నిర్వహించారు. పీడీ అంజలి పాల్గొన్నారు.

విడపనకల్లు: మండలంలోని గడేకల్లులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాతృభాష దినోత్సవం గురువారం జరిగింది. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మనోహర్‌రావు, ఉపాధ్యాయులు ఓబుళరెడ్డి, ప్రసాదు, ఆయూబ్‌ఖాన్, పద్మావతి, తెలుగు భాషా పండితులు ప్రసాదు పాల్గొన్నారు.

శెట్టూరు: మండలంలోని లక్ష్మంపల్లి ఉన్నత పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం గురువారం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళి అర్పించారు.